ప్రజాశక్తి

ఆదివారం 3 నవంబర్ 2024 5 విజయనగరం



బ్యాడ్మింటన్‌లో నవనీత్‌కు 3వ ర్యాంకు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న గంట నవనీత్ ఈనెల 4 నుంచి 7 వరకు విజయవాడలో జరుగుతున్న అండర్ 13 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో ర్యాంక్ సాధించినట్లు కోచ్ గుర్రోతు శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి అండర్ 13 మేజర్ ర్యాంకింగ్ పోటీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించి ప్రతిభ కనబరిచాడు. నవనీత్ పిట్ట కొంచెం కూతఘనం అనుచందాన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం లో జరిగిన అండర్ 14 స్కూల్ గేమ్స్ టీం ఛాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి పాల్గొని జిల్లాను ద్వితీయ స్థానంలో నిలబెట్టాడు. నవ నీత విజయవాడలో జరగబోతున్న రాష్ట్ర పోటీల్లో ఛాంపియన్స్‌గా నిలవాలని కోచ్ జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు మోగిన నగారా

- 4న నోటిఫికేషన్.. • 11 వరకు నామినేషన్లు
- 28న ఎన్నిక • డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు
- అమల్లో ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నగారా మోగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ప్రస్తుతం అమలులోకి వచ్చేసింది. ఈ మేరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు కూడా శనివారం ప్రకటనలు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో, చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేశారు. దీంతో, రఘురాజు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆరువారాల పాటు స్టే విధించింది. త్వరలోనే కోర్టు తీర్పురావాల్సివుంది. ఈలోపే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీకి ప్రకటన విడుదల చేయడం గమనార్హం. తాజాగా ఎన్నికల సంఘం జారీచేసిన ప్రకటన ప్రకారం ఈనెల 4వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 12వ తేదీన నామినేషన్లు పరిశీలన, 14వరకు ఉపసంహరణ కొనసాగుతుంది. 28న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఈనేపథ్యంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళి పాటించాల్సివుంటుంది. నూతన విధానాలు, కార్యక్రమాలను ప్రకటించారాదని ఎన్నికల సంఘం వారికి సూచించింది. అధికారిక కార్యక్రమాలను ఎన్నికల కార్యక్రమాలతో జత చేసి నిర్వహించడానికి కూడా అవకాశం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు జిల్లాలో వీడియో సర్వైలెన్స్ బృందాలు, ఇతర బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ తో సహా అన్ని బృందాలనూ ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ విధి విధానాలకు లోబడి అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాల్సివుంది.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు : కలెక్టర్

స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో, జిల్లాలో శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రతీఒక్కరూ విధిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలను చేయరాదని, ఓటర్లను ప్రలోభపెట్టే ఎటువంటి చర్యలను చేయకూడదని స్పష్టం చేశారు. రాష్ట్ర, కేంద్ర మంత్రులు తమ పర్యటనల సందర్భంగా ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

మండలి బరిలో టిడిపి నిలిచేనా?

- స్థానిక సంస్థల్లో వైసిపి ప్రజాప్రతినిధులే అధికం
- ఆసక్తికరంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. స్థానిక సంస్థల్లో అత్యధిక ప్రజాప్రతినిధులు వైసిపికి చెందినవారు ఉండగా, రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ లెక్కన వైసిపికే ఎక్కువ బలం ఉంది. వీరంతా పార్టీ విధానానికి కట్టుబడి ఉంటే, ఏం జరుగుతోందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ, రహస్య ఓటింగ్ కాబట్టి టిడిపి కాస్త సాహసం చేస్తుందా? లేక విశాఖలో మాదిరిగా వెనక్కి తగ్గుతుందా? అన్నదానిపై అందరిలోనూ ఆసక్తి కర చర్చ నడుస్తోంది. ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, పురపాలక సంఘాల్లో కౌన్సిలర్లు, నగర పాలక సంస్థలో కార్పొరేటర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నిక పాత విజయనగరం జిల్లా ప్రాతిపదికన జరుగుతుంది. ఈలెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల తొమ్మిది నియోజకవర్గాల్లో 743 మంది ఓటర్లు ఉండగా, టిడిపి కూటమికి 155 మంది, వైసిపికి 578 మంది ఉన్నారు. 9 మంది మరణించారు. ఒకరు ఇండిపెండెంట్ ఎంపిటిసి ఉన్నారు. ఎంపిటిసి సభ్యులు 549 మందిలో టిడిపికి 100 మంది, వైసిపికి 447 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 34 మంది జెడ్‌పిటిసి సభ్యులంతా వైసిపి వారే. విజయనగరం కార్పొరేషన్‌లో 50మంది కార్పొరేటర్లు, పార్వతీపురంలో 30మంది, బొబ్బిలిలో 31మంది, సాలూరులో 29మంది, నెల్లిమర్ల నగర పంచాయతీలో 20మంది చొప్పున కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 30 మంది టిడిపి, 129 మంది వైసిపి వారుండగా, ఇతరులు ఒకరున్నారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజుకు కూడా ఓటు హక్కు ఉంది. ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చాక టిడిపిలో 21 మంది ఎంపిటిసిలు, ఐదుగురు కౌన్సిలర్లు చేరారు. జనసేనలో ఆరుగురు, వైసిపిలో ఇద్దరు ఎంపిటిసిలు చేరారు. మెజారిటీ స్థానాలు తమవే కాబట్టి గెలుపు తథ్యమని వైసిపి నాయకులు భావిస్తున్నారు. స్వతంత్రంగావున్న ప్రజాప్రతినిధులు సహా చాలా మంది ఓటర్లు తమకు సహకరిస్తారన్న వాదనతో టిడిపి నాయకులు కూడా చెబుతున్నారు. ఆకస్మికంగా నోటిఫికేషన్ జారీ కావడంతో అటు టిడిపి, అటు వైసిపి నాయకులు ఎన్నికల వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. టిడిపి తరపున పోటీ చేయాలా? లేదా? అన్నదానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతుండగా, వైసిపి అభ్యర్థి ఎంపికలో ఆపార్టీ తలమునకలైంది. అతి త్వరలోనే అభ్యర్థి పేరు కూడా ఖరారయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. విజయనగరం నుంచి ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉండడంతో ఈసారి మన్యం జిల్లాకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గత ఐదేళ్లలో రోడ్లన్నీ అస్తవ్యస్తం

రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్లను అభివృద్ధి చేయడం, సక్రమంగా నిర్వహించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం గంగచోళ్ళపెంట గ్రామంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్లను అస్తవ్యస్తంగా తయారుచేసిన వారు, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేక మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విజయనగరం జిల్లాలో రోడ్లు భవనాల శాఖ రూ. 284.35 కోట్ల వ్యయంతో 368 రోడ్డు నిర్మాణ పనులకు ఆమోదం తెలుపగా, వాటిలో రూ.177 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మిగిలిన పనులు నిర్మాణ దశలో ఉండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019-24 మధ్యకాలంలో 155 పనులను రూ.320 కోట్ల ఖర్చుతో పనులు మంజూరు చేసిందని తెలిపారు. అయితే వీటి నిర్మాణం కోసం ఖర్చు చేసింది కేవలం 10 కోట్లు మాత్రమేనని అన్నారు. మంజూరు చేసిన పనులకు నిధులు ఇవ్వకుండా, రోడ్ల నిర్వహణను గాలికి వదిలేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగు నెలల కాలంలోనే విజయనగరం జిల్లాలో అత్యవసరంగా 73 పనుల కోసం రూ.10.30 కోట్ల విలువైన అత్యవసర రోడ్డు నిర్వహణ పనులను మంజూరు చేసిందని తెలిపారు. గతంలో నిధులు చెల్లించకుండా పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు రూ.60 కోట్లను ఈ నాలుగు నెలల కాలంలోనే విడుదల చేసిందని మంత్రి వివరించారు తాము చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు.

4న గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈనెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని ఆయన కోరారు.

పోలీసు గ్రీవెన్స్ కూడా..

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై, ఎన్నిక కోడ్ అమల్లోకి రావడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు.

పాలధర తగ్గింపుతో రైతులకు నష్టం

డెయిరీ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

బొబ్బిలి.. ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

విశాఖ డెయిరీ పాల ధరను తగ్గించడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తగ్గించిన పాల ధర నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చూడాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం.. ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని శనివారం కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీటరు ఆవు పాలకు రూ.50, గేదె పాలకు రూ.80 ఇవ్వాలని, డెయిరీ లాభాలతో రైతులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార రంగంలోకి తీసుకు రావాలని కోరారు. విశాఖ డెయిరీ అక్రమాలపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేసి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అన్యాక్రాంతమైన ఆస్తులను వెనక్కి రాబట్టాలని డిమాండ్ చేశారు. పాల రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బేబినాయనను కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ తిరుపతిరావు, అనంతరావు పాల్గొన్నారు.

తగ్గించిన పాల ధరను ఉపసంహరించుకోవాలి

నెల్లిమర్ల : విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని పాల ఉత్పత్తిదార్లు డిమాండ్ చేశారు. శనివారం మొయిద విజయరాంపురం విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో తగ్గించిన పాల ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని పాల ఉత్పత్తి దార్లు నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ధరను లీటరుకు 5 రూపాయలు తగించాలని నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు లీటరుకు 1 నుంచి రెండు రూపాయలు మాత్రమే పెంచడం జరిగిందని గత నెల నుంచి 5 రూపాయలు తగ్గించడం భావ్యం కాదని అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడి పాలను ఉత్పత్తి చేస్తున్నామని ధర పెంచాల్సింది పోయి తగ్గించడమేమిటని ప్రశ్నించారు. విశాఖ డెయిరీ యాజమాన్యానికి వచ్చే లాభాల్లో నాలుగు నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని ఆవు పాలు లీటర్‌కు 50, గేదె పాలు లీటర్‌కు 80 రూపాయలు ఇచ్చి దాణాలో 75శాతం సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల ఉత్పత్తి దార్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. నిరసన తెలుపుతున్న పాలరైతులు

విద్యార్థులకు ఆపార్ కష్టాలు

- తప్పులతో ఆధార్ వివరాలు
- డిజిటల్ కార్డులు జారీకి ఆటంకం



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఆపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్రిజిస్ట్రీ) సంఖ్య అందించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' అనేనినాదంతో కొత్తప్రక్రియను అమలు చేస్తోంది. ఈ నమోదుకు ఆధార్ వివరాలు ఆటంకంగా మారుతున్నాయి. ఆధార్‌లో ఉన్న సమాచారం మేరకే ఆపార్ కార్డులు జారీ అవుతాయి. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకలుగా ఉండడంతో ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్ లోని వివరాలు సరిచేసిన తర్వాత ఆపార్‌లో నమోదు చేయాల్సి వస్తుంది. ఆధార్ వివరాలు మార్చడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఈ ప్రక్రియ సజావుగా సాగదని ఉపాధ్యాయులు, సిబ్బంది అంటున్నారు.

తప్పులు సవరించాల్సిందే...

ఆధార్ వివరాల్లో పెద్దఎత్తున తప్పులు న్నాయి. ప్రస్తుతం ఆపార్ కార్డు విద్యార్థులకు తప్పనిసరి కావడంతో ఆధార్లోని తప్పులను సరిచే యాల్సి ఉంది. గ్రామీణ వాసులు సమీప పట్టణ ప్రాంతా లకు వెళ్లి తప్పులను సవరించుకోవాల్సి వస్తోంది. పాఠశాలలో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికేట్ ఇస్తే.. ఈ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఆధార్ వివరాల సవరణ బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల ఆధార్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తే. ఆపార్ నమోదు వేగవంతమవుతుంది.

జిల్లాలోని 2234 పాఠశాలల్లో 2,23,947 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 99403 మంది విద్యార్థులకు ఆపార్ నమోదైంది. అంటే 44.38 శాతం నమోదు అయ్యింది.

పాఠశాలల్లోనే సమస్య పరిష్కరించేలా..

ఇక నుంచి విద్యార్థికి సంబంధించిన సర్టిఫికెట్లు, ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత వివరాలు అపార్‌లో నమోదై ఉంటాయి. చాలా మంది విద్యార్థులకు ఆధార్ జారీ చేసే సమయంలో పుట్టిన సంవత్సరం, పేరు, చిరునామా వంటి వివరాల్లో తప్పులుండడంతో అపార్ డిజిటల్ కార్డులు వెలువడడం లేదు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అన్ని స్కూళ్లకు ఆధార్ కేంద్రాలు వారు వెళ్లి తప్పులను సరిచేస్తారు. పది రోజులు పాటు ఆధార్‌లో లోపాలను సరిచేయడానికి అందుబాటులో ఉండే విధంగా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.

\- యు.మాణిక్యం నాయుడు, డిఇఒ

సగానికి పైగా విద్యార్థుల వివరాల్లో తేడాలు

జిల్లాలో ఆపార్ కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు. ఈ కార్డుల జారీ బాధ్యతలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అప్పగించింది. నవబరు 30లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఇదివరకే ఆదేశాలు జారీ అయ్యాయి. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల దస్త్రాల్లో ఒకలాగా.. ఆధార్ కార్డుల్లో మరోలా ఉన్నాయి. జిల్లాలో సగం మంది విద్యార్థుల వివరాలే.. దస్త్రాలు, ఆధార్ కార్డులతో సరిపోలుతున్నాయి. ఆధార్ కార్డుల్లో ఎక్కువగా తప్పులుంటున్నాయి. ఒకసారి ఆపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యి, ఉద్యోగం సాధించేవరకు ఇదే నంబరు గల కార్డు ఉంటుంది. నగరంలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న టి.తేజేష్, రెండవ తరగతి చదువుతున్నాడు. పాఠశాల యు డైస్ లో వివరాల్లో ఇంటిపేరు రెండు సార్లు రిపీట్ కావడంతో అపార్ నమోదవ్వ లేదు. మరో తొమ్మిది తరగతి చదువుతున్న ఎస్.బాలాజీ అనే విద్యార్థి ఇంటిపేరులో సంకోరుబోతుకు సుంకోరు బోతు అని ఆంగ్ల అక్షరాల్లో 'ఎ'కు బదులు యు పడటంతో ఆపార్‌లో నమోదు కావడం లేదు. నారాయణ పాఠశాలలో చదువుతున్న గేదెల శశిధర్‌నాయుడు పేరులో అచ్చుతప్పు ఉండడంతో నమోదు కావడం లేదు. ఇలాంటి వారంతా సమీపంలోని ఆధార్ కేంద్రాన్ని సంప్రదించి జనన ధ్రువపత్రం లేదా పాఠ శాల రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయుని సంతకంతో సర్టిఫికేట్ తీసుకొస్తే సవరిస్తామని ఆధార్ కేంద్రాలు వారు చెబుతున్నారు. దీంతో అపార్ నమోదు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది.

నేర ప్రవృత్తిని వీడకపోతే చర్యలు

రౌడీ షీటర్లకు ఎస్‌పి హెచ్చరిక • పోలీసుస్టేషన్ల పరిధిలో కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కౌన్సిలింగ్ ఇస్తున్న టూ టౌన్ సిఐ శ్రీనివాస్

రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడనాడకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందాల్ హెచ్చరించారు. రౌడీ షీట్లు, ఇతర బ్యాడ్ క్యారెక్టర్లు షీట్లు కలిగిన వ్యక్తులకు ఎస్‌పి ఆదేశాలతో శనివారం జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్లకు పిలిచి, మంచి ప్రవర్తన కోసం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, వారు నిర్వర్తించే పనులు, ప్రస్తుత వారి జీవన విధానం పట్ల నిఘా పెట్టాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. మళ్ళీ నేరానికి పాల్పడే అవకాశం ఉన్నట్లుగా వారి ప్రవర్తన ఉంటే ప్రత్యేకంగా నిఘా ఉంచాలని, మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేయాలని తెలిపారు. వారి జీవనోపాధికి చేస్తున్న వృత్తులు, ఎక్కడ పని చేస్తున్నారన్న విషయాలపై ఆరా తీయాలన్నారు. ఎస్‌పి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు.. బిసిలను, రౌడీలను పోలీసు స్టేషనుకు పిలిచి, వారి నేర ప్రవర్తన, జీవనోపాధి గురించి ఆరా తీసి, రికార్డుల్లో వివరాలను నమోదు చేశారు.

వక్తృత్వ పోటీల విజేతలు వీరే

విజయనగరం కోట : గురజాడ సాహితీ చైతన్య ఉత్సవాల్లో భాగంగా శనివారం గురజాడ స్వగృహంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరిగాయి. గత నెల 28న జరిగిన ప్రథమ స్థాయి పోటీలో ఎంపిక చేసిన 18 మంది విద్యార్థులకు తుది పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి లక్ష్మి ప్రసన్న (ఫోర్టుసిటీ స్కూలు), ద్వితీయ బహుమతి దివ్య వర్షిణి (భాష్యం స్కూల్), తృతీయ బహుమతి ఎస్.జ్యోతి (ఆదిత్య స్కూలు), కన్సులేషన్ బహుమతి ఆశాభావని (గురజాడ స్కూల్), దీపశ్రీ (సన్‌స్కూలు) సాధించారు. ప్రథమ, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులకు ఈనెల 30న జరిగే సభలో బహుమతులు అందజేస్తామని గురజాడ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు.

గుంతల బాగోతంలో ఒరిగిందెంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'తడి తక్కువ తమాషా ఎక్కువట. అచ్చంగా అలాగే ఉంది జిల్లాలో తలపెట్టిన గుంతల పూడ్చివేత, దీనిపై ప్రభుత్వ యంత్రాంగం ప్రచారానికి సిద్ధపడిన తీరు. ఈతకాయంత నిధులు ఇచ్చి, తాటికాయంత ప్రచారం చేసుకునేందుకు తహతహలాడిపోయారు. నిధులు తక్కువ కేటాయించినందుకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అధికార పార్టీ నాయకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు ఈ పనులు ప్రారంభానికి ఏకంగా ముఖ్యమంత్రి రావడమే గొప్ప విషయంగా భావించారు. ఈ మాటకొస్తే గుంతలు పూడ్చే కార్యక్రమానికి మునుపెన్నడూ ఇంత హడావుడి జరగలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో ప్రారంభోత్సవాలు చేయలేదు. కానీ, శనివారంనాడు ఈ పనులు ప్రారంభించేందుకు సిఎం వస్తారన్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కేటాయించిన సమయం అంతా ఇంతా కాదు. జిల్లా అధికారులు మొదలుకుని కొన్ని శాఖల సిబ్బంది వరకు దీపావళి పర్వదినంలో కూడా ఇంటిల్లపాదీ కలిసిమెలిసి ఉండే అవకాశం కోల్పోయింది. రాత్రి పగలు అనే తేడా లేకుండా శ్రమించారు. కొంతమందికి రెండు రోజులపాటు కంటిమీద కునుకులేదు. సిఎం కార్యక్రమం కోసం గజపతినగరం మండలం గంగచోళ్లపెంట, పురిటిపెంట గ్రామాల్లో హెలీప్యాడ్ తయారీ, నేల చదును చేసేందుకు టిప్పర్లు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, రోలర్లు, బుల్డోజర్లు, షామియానాల ఏర్పాటు తదితరాల అద్దెలు, మీటింగ్ హాల్ ఏర్పాటు, శిలాఫలకం వంటివాటికి సుమారు రూ.కోటి వరకు ఖర్చుచేశారు. తీరా ఆ రోజు రాత్రికి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సిఎం పర్యటన అనివార్యంగా రద్దయ్యింది. కోడ్ అమల్లో ఉన్నందున సిఎం రాలేదని ఎవరూ నిందించలేదు. ఈ సంగతి కాస్త అటుంచితే... గుంతలు పూడ్చే కార్యక్రమంపై ప్రచారానికి ప్రభుత్వ పెద్దల ఆత్రం అంతా ఇంతా కాదని జనం నుంచి వినిపిస్తున్న మాట. రహదారుల నిర్మాణం, వాటి మెయింటినెన్స్ అనేది ప్రభుత్వ బాధ్యత, ప్రయాణికుల నుంచి రోడ్డు ట్యాక్స్, టోల్ గేట్ ఛార్జీల రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయి. ఈ భారాన్ని తగ్గించగలిగితే ప్రభుత్వం గొప్పగా చెప్పుకోవడంలో తప్పులేదు. కానీ, రోడ్ల మరమ్మతులకే ఇంత గొప్పగా చెప్పుకోవడమా? అనేది పబ్లిక్ టాక్. సరే గత ప్రభుత్వం కన్నా తామే ఎంతో మేలు చేస్తున్నామన్న ఆత్రంతో ఆమాత్రం హంగామా చేసివుంటే తప్పేంటి? అని ప్రభుత్వం, మన జిల్లాలోని ప్రతిజాప్రతినిధులు భావించి

వుండవచ్చు అనుకున్నా, ఈ గుంతల బాగుచేయడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన మొత్తం ఎంత? అందులో మన జిల్లాకు వచ్చిన మొత్తం ఎంత? అంటే ఆవగింజలో అరవైవ వాటాయేనని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది చోట్ల రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు రూ.826కోట్లు అంటూ గడిచిన మూడు రోజులుగా జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రకటన విడుదల చేశారు. మరి ఇందులో మన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు కేటాయించిందెంత? ఇది ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులు సంధిస్తున్న ప్రశ్నలు. విజయనగరం జిల్లాలో 73 పనులకు కేవలం రూ.10.57కోట్లు. ఆర్అండ్‌బి అధికారుల లెక్కల ప్రకారం అయితే 63 పనులకు రూ.10.02కోట్లు మాత్రమే. పార్వతీపురం మన్యం జిల్లాలో అయితే 5పనులకు రూ.13.70కోట్లు కేటాయించినట్టు సమాచారం. ఈలెక్కన గుంతల పూడ్చివేతకు రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన నిధుల్లో విజయనగరం జిల్లాకు ఇచ్చింది కేవలం 14శాతంలోపే. మన్యం జిల్లాకూ దాదాపు ఒక్కశాతం అటూ ఇటుగా అంతే లెక్క. ఈ మాత్రం సాయానికి మన జిల్లాకు చెందిన నాయకత్వం ఇంతలా మురిసిపోతే ఎలా? అన్నది పలువురి వాదన. అందులోనూ సిఎం ప్రారంభానికి తలపెట్టిన గుంతల పని కూడా అక్షరాలా ఆరు కిలోమీటర్లు, దానికి కేటాయించిన మొత్తం కేవలం రూ.37లక్షలే. ఇలాంటి పరిస్థితుల్లో సిఎం ప్రసన్నం పొందేదానికన్నా మరింతగా నిధులు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తే బాగుండేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఇంత తక్కువ మొత్తంలో చేపట్టే పనులకు ఇంత హడావుడి చేయడం మానుకుంటే బాగుంటుందన్నది పబ్లిక్ టాక్. గుంతల పూడ్చివేతకే ఇంతలా ప్రచారం చేసేందుకు సిద్ధపడితే కొత్తగా రోడ్లు వేస్తే ఇంకెంత హడావుడి చేస్తారో అంటూ జనం విస్తుపోతున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కాంతారావు , ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న నక్కెల్ల గంగరాజు ఎంపికయ్యాడని హెచ్‌ఎం జి.ఎస్.కాంతారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అక్టోబర్ 27 నుంచి 29వ తేది వరకు అన్నమయ్య జిల్లా (కడప)లో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేది వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గంగరాజును వ్యాయామ ఉపాధ్యాయలు సూర్యారావు, ఉపాధ్యాయలు, గ్రామ పెద్దలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వంగర : రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కొమరాపు చందు, బొడ్రోతు సౌమ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రవణమ్మ తెలిపారు. ఈ నెల 3,4 తేదీలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు కవితను ప్రధానోపాధ్యాయులు రవణమ్మ పాఠశాల సిబ్బంది అభినందించారు

వెల్ఫేర్ అసిస్టెంట్ ఔదార్యం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఔదార్యాన్ని చాటుకున్నారు. జాకేరు సచివాలయ పరిధిలోని గుడివాడ గ్రామానికి చెందిన గుడివాడ మల్లయ్య విశాఖపట్నం టిబి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వృద్ధాప్య పింఛను దారుడు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ తన సొంత డబ్బులతో శనివారం విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి మల్లయ్యకు పింఛను అందజేశారు. దీంతో గ్రామస్తులు ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లయ్యకు పింఛను అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

పొత్తు ధర్మంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి- భోగాపురం

నెల్లిమర్ల నియోజవర్గంలో జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు పొత్తు ధర్మంతో ముందుకు వెళ్లాలని నియోజకవర్గం జనసేన సీనియర్ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం అయన స్థానిక జనసేన నాయకులతో కలిసి సామాజిక మధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు కూటమి నాయకుల మధ్య మనస్పర్థలను అలుసుగా తీసుకొని విష ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా ద్వారా లోకం నాగ మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుపై లేనిపోని అబండాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఇవన్నీ టీ కప్పులో తుఫాన్ లాంటివని చెప్పారు.

ఒకే కాన్పులో మూడు దూడలు జననం

భోగాపురం : ఒక ఆవు చనిపోయిన మూడు దూడలకు ఒకేసారి జన్మనిచ్చింది. ఈ సంఘటన మండలంలోని పోలిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కర్రోతు వెంకట సత్యం అనే రైతుకు చెందిన ఆవు మొదటి కాన్పులోనే ఇలా మూడు దూడలకు జన్మనిచ్చింది. అయితే కాన్పులోనే మూడు దూడలు కూడా చనిపోయాయి. దీనిపై పశువైద్యాధికారిణి వై.కమల కుమారి మాట్లాడుతూ తల్లి నుంచి పోషణ మూడు దూడలకు సరిపోకపోవడంతో పెరుగుదల లేక లోపంతో చనిపోయాయని తెలిపారు.

పోలి క్లినిక్ మంజూరుపై హర్షం

బొబ్బిలి : మాజీ సైనికులకు వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లాలో నూతన పోలి క్లినిక్ (ఇసిహెచ్‌ఎస్) మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంపై మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సైనికుల కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోలి క్లినిక్ ఏర్పాటు చేయడం వల్ల 3,500 మంది మాజీ సైనికులకు వైద్య సేవలు అందుతాయని మాజీ సైనికులసంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ తెలిపారు.

కల్చరల్ ఫెస్ట్‌కు బొంతలకోటి

బొబ్బిలి : హైదరాబాద్‌లో శిల్పారామంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే భారత్ లార్జెస్ట్ కల్చరల్ ఫెస్టివల్-2024కు తూర్పు భాగవతం కళాకారుడు బొంతలకోటి శంకరరావు ఎంపికయ్యారు. ఆ ఫెస్టివల్‌లో తూర్పు భాగవతాన్ని ప్రదర్శించనున్నట్లు బొంతలకోటి శంకరరావు చెప్పారు. శంకరరావును ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎపిటిఎఫ్

రామభద్రపురం : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మారుతి కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్నా నేటికీ విద్యా సంబంధిత ప్రధాన సమస్యలపై స్పందన లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ, పిఎఫ్ బకాయిలు నేటికీ చెల్లించక పోవడం అన్యాయమన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు

గంట్యాడ : బుడతనాపల్లిలోని ప్రగతి రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యాన శిక్షణ పొందిన మహిళలకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆ సంస్థ డైరెక్టర్ వి.రమణ, ఎపిజివిబి బుడతనాపల్లి బ్రాంచి మేనేజర్ ఉషారాణి, సంఘం అధ్యక్షులు బి.రాంబాబు.. 35 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ ఆర్‌ఎస్‌ఇటిఐ ఫ్యాకల్టీ సమన్వయకర్త హర్ష, గ్రామ పెద్దలు రవి, తదితరులు పాల్గొన్నారు.

యువతికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎపిజివిబి మేనేజర్ ఉషారాణి

అభివృద్ధికి నోచని అంబాడ వెంకటాపురం

- ఎంపిపి స్వగ్రామంలో సమస్యల లొల్లి
- కానరాని సిసి రోడ్లు
- గ్రామస్తుల పెదవి విరుపు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ వెంకటాపురం అభివృద్ధికి నోచుకోక పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ రెండు గ్రామాల్లో సుమారు 1150 కుటుంబాలున్నాయి. వెంకటాపురం గ్రామంలో మెయిన్ వీధి, దళిత కాలనీ, బిసి వీధి, రామ్ మందిరం వీధిలో సిసి రోడ్లకు నోచుకోలేదు. ఈ గ్రామంలో పూర్తిగా సిసి రోడ్లు, కాలువలు లేకపోవడంతో రోడ్ల పైన మురుగునీరు నిల్వగా ఉండి నాచుతేరి దోమలు వ్యాప్తి చెంది గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. ఈ పంచాయతీలో స్వయాన మండల అధ్యక్షులు (ఎంపిపి) దార అప్పల నరసమ్మ ఉన్నప్పటికీ గ్రామం అభివృద్ధి చెందలేదు. ఎంపిపి స్వగ్రామమైనా అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండడంతో ఇతర గ్రామాలను ఎలా అభివృద్ధి చేస్తారో అని గ్రామస్తులు పెదవిరుచుకుంటున్నారు. కనీసం గ్రామంలో మౌలిక సౌకర్యాలు లేకపోవడం, పంచాయతీ పాలకవర్గం పూర్తిగా పట్టించుకోక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసిపి సర్పంచ్ చుక్కా వెంకటి నాయుడు, వైసిపి నాయకుడు చుక్క వేణు నాయుడు వైసిపి కాలంలో సిసి రోడ్లు, కాలువలు, ఇతర డ్రైనేజీలు చేయకుండానే చేసేశామని బిల్లులు పెట్టుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనులు చేయకుండా బిల్లులు చేయడమేమిటిని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. అక్కడక్కడా చేసిన పనులకు కూడా నాణ్యతా ప్రమాణాలు లేవని అవి మూడు నాళ్లకే ముచ్చటగా పాడైపోయాయని చెబుతున్నారు. ఈ పనులపై మండల, జిల్లా అధికారులు పరిశీలించి పనులు చేయని వాటికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంబాడ గ్రామంలో మెయిన్ వీధి తప్ప మిగతా చిన్న, చిన్న వీధులు సిసి రోడ్లకు నోచుకోలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల కాలంలో సర్పంచ్ వెంకటి నాయుడుకు సచివాలయం పనులు, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు మంజూరు చేసినప్పటికీ ఈ ప్రభుత్వ కార్యాలయాలు పూర్తి చేయకుండా అసంపూర్తిగానే వదిలేశారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కాలంలో పనులు చేసాం బిల్లులు ఇచ్చేయండి అంటూ అధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతున్నారే తప్ప వాస్తవంగా పనులు చేశారా.? లేదో అనేది విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గోపాల్ నాయుడును ప్రశ్నించగా తాను పంచాయతీ కార్యదర్శిగా కొత్తగా వచ్చానని, తనకేమీ తెలియదని బుదులిచ్చారు.

అభివృద్ధికి నోచుకోని అంబాడ వెంకటాపురంలోని దళిత కాలనీ

వైసిపి నుంచి టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని పాతరేగ గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాలతోపాటు మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సభ్యులు వైసిపిని వీడి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో టిడిపిలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే బేబీనాయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు కషి చేస్తున్నానని, కార్యకర్తలంతా ఐకమత్యంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యతాపరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పాతరేగ, కొత్తరేగ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మడక తిరుపతినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చూస్తూ పరిపాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో పాతరేగ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు పెద్దింటి పైడిపునాయుడు,సహకార బ్యాంకు మాజీ చైర్మన్ అవుగడ్డి బలరామస్వామినాయుడు ఆధ్వర్యంలో వందలాది కుటుంబాలు పార్టీలో చేరాయి. టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు, బూసాయవలస సర్పంచ్ ప్రతినిది గంటా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్‌ను అయ్యన్నపేటకు చెందిన కర్రోతు వెంకటరమణకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి శనివారం అందజేశారు. వెంకటరమణ ఇటీవల అనారోగ్యం బారినపడి శస్త్రచికిత్స చేయించు కున్నారు. అతని కుటుంబం ఆర్థికపరిస్థితి బాగోలేనందున ఎమ్మెల్యేఅదితి విజయలక్ష్మి సిఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా, రూ.2,52,424 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

పుస్తకాలు పంపిణీ

వేపాడ : ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన గణిత దీప్తి పుస్తకాలను సోంపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. అదే పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు, ఎల్.కోట కెజిబివిలో హిందీ సిఆర్‌టి ఆతవ రవిశంకర్, అనురాధ దంపతులు వాటిని వితరణ చేశారు. ఆ పుస్తకాలను ఎంఇఒ-2 పి.బాలభాస్కర్ విద్యార్థులకు పంపిణీచేశారు. సోంపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు చెక్‌రూల్, పెన్సిల్, స్కేల్, తదితర వస్తువులు అందించారు.

సకాలంలో చెల్లింపులు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

డిజిటల్ అసిస్టెంట్లు సకాలంలో ప్రభుత్వానికి చెల్లింపులు చేయాలని డిఎల్‌డిఒ ఎం.కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తాలను ఇ-సర్వీసుల ద్వారా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, బాడంగి ఎంపిడిఒలు పి.రవికుమార్, ఎస్.రామకృష్ణ, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు గడువు పెంచాలి

ప్రజాశక్తి- మెరకముడిదాం

త్వరలో జరగబోవు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్ల నమోదు కోసం గడువును నవంబర్ 6వ తేదీ నుంచి మరో పదిహేను రోజులు పొడిగించాలని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేటెడ్ ప్రెసిడెంట్ అల్తి రాంబాబు రాష్ట్ర ఎన్నికల అధికారికి లేక రాసినట్లు శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఇటీవల వర్షాలు, దసరా సెలవులు కారణంగాను పాఠశాలలకు సెలవులు వచ్చిన నేపథ్యంలో చాలామంది ఓటర్లు నమోదు చేసుకోలేదని, నమోదు ప్రక్రియ గడువును మరో పదిహేను రోజులు పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల పిఆర్‌టియు ప్రెసిడెంట్ ఆర్. సింహాద్రి, అల్తి శ్రీహరి, పలువురు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

బొబ్బిలి : రామన్నదొరవలసలో గిరిజనులకు సేవా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థను వాసు విద్యా సంస్థల అధినేత రౌతు వాసుదేవరావు శనివారం ప్రారంభించారు. మొదటి సేవా కార్యక్రమంలో భాగంగా గిరిజనలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పేదల కోసం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన వ్యవస్థాపక అధ్యక్షులు లంక వాసుదేవరావును రౌతు వాసు అభినందించారు. పేదలకు అండగా ఉండాలని కోరారు.

మారిక రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామం మారికకు వెళ్లే మార్గాన్ని శనివారం పంచాయతీరాజ్ డిఇ సత్యనారాయణమూర్తి పరిశీలించారు. ఇటీవల గ్రీవెన్స్‌లో రహదారి సమస్యపై కలెక్టర్‌కు మారిక గిరిజనులు వినతినిచ్చారు. అర్థాంతరంగా రోడ్డు పనులు నిలిపేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇ ఆ రోడ్డును పరిశీలించారు. ఉన్న నిధులతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డును డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని డిఇ తెలిపారు. రోడ్డు విస్తరణ, మిగతా రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని వెల్లడించారు. ఈ పరిశీలనలో ఎఇఇ ఐశ్వర్య, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, టిడిపి నాయకులు ఎర్రాప్రగడ సూర్యం పాల్గొన్నారు.

మారిక రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు అడ్డగింత

ప్రజాశక్తి-బొబ్బిలి

మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులు చేపట్టిన పనులను మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. పట్టణంలోని పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రభుత్వం మంజూరు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసేందుకు శనివారం అధికారులు చదును చేసే పనులను చేపట్టారు. ఖాళీ స్థలంలో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా, కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే పోరాటం ఉధృతం చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలి

మున్సిపల్ కార్మికుల నివాసాల పక్కనున్న ఖాళీ స్థలంలో వారికి ఇళ్ల పట్టాలివ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అధికారులను డిమాండ్‌చేశారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకివీధిలో ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పాకివీధి పక్కనే ఉన్న స్థలంలో మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీనిచ్చారని, ఆ మేరకు పట్టాలివ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికుల 16 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు బి.యుగంధర్, జి.వాసు, జి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శంకర్రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఒ కె.సాంబమూర్తి

శత శాతం ట్రేడ్ లైసెన్స్ విధింపే లక్ష్యం

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర పరిధిలో వ్యాపార, వాణిజ్య దుకాణాలకు శతశాతం ట్రేడ్ లైసెన్సుల విధింపే లక్ష్యంగా కృషి చేయాలని సిబ్బందికి కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. వాణిజ్య సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు విధింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేసేందుకు 10 టీములను ఆయన ఏర్పాటు చేశారు. సచివాలయ కార్యదర్శులు సహాయకులుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పారిశుధ్య పర్యవేక్షకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని, ఇందుకోసం తనిఖీలు ముమ్మరం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రహదారులపై చెత్తాచెదారాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరుబయట చెత్తలు వేసిన వారిపై అపరాధ రుసుము వసూలు చేయాలని చెప్పారు. ప్రతి వాణిజ్య దుకాణానికి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ ఉండాలన్నారు. ఇదివరకే ట్రేడ్ లైసెన్సులు పొందిన వారు రెన్యువల్ చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

డబ్బులు తీసుకోకుండానే ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. సిలిండర్‌కి ముందుగా డబ్బులు కట్టించుకుని ఇచ్చి తిరిగి బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తామని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. డబ్బులు కట్టించుకున్న తరువాత బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు పడకపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అసలు ఉచిత సిలిండర్ అని చెప్పి డబ్బులు కట్టించుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిబిఎం పాఠశాల భూబదలాయింపు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన స్కూల్ కరస్పాండెంట్ రత్నకుమార్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్‌చేశారు. రద్దయిన స్కూల్ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు సునీల్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు శ్రావణ్ పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు కోరారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్‌ను మాజీమంత్రి కలిసి పలు సమస్యలను వివరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులను బాగు చేయాలని, పారాది వంతెన పనులు వేగవంతం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

సాదాసీదాగా బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - గుర్ల

మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం మండల సాధారణ బడ్జెట్ సమావేశాన్ని ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షత న నిర్వహించారు. 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి సాధారణ నిల్వ, రాబడులు, ముగిపంపు నిల్వల వివరాలను సభ్యులకు తెలియజేశారు. మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపిపి సభ్యులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలలో ఉన్నందున సమావేశంలో చర్చిలకు అవకాశం లేకపోవడం సమావేశం సాదాసీదాగా ముగించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపిడిఒ శేషుబాబు, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మీ, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయనగరంకోట

విశాఖ జిల్లా పద్మనాభం మండలం సత్యనారాయణపురానికి చెంది రౌతు నారాయణ (350 చాకలిపేట లేఅవుట్ లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బారిన పడి తీర్చలేక పురుగుమందు తాగిన అతడిని స్థానికులు గుర్తించి జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

బాణసంచా షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కెఎల్‌పురం సమీపంలో ఉన్న పలు హోల్‌సేల్ బాణాసంచా షాపులపై లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పలు కంపెనీల ఉత్పత్తులను పరిశీలించి కొన్నింట్లో లోపాలున్నట్లు గుర్తించి మూడు షాపులపైనా, మూడు కంపెనీలపైనా కేసులు నమోదు చేశారు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ప్యాకెజీలపై తయారీ తేదీలు లేకపోవడం, విక్రయ ధర లేకపోవడం, ప్రత్యేక స్టికర్ అంటించడం కంపెనీ చిరునామాలు లేనట్లు గుర్తించి సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ యం.దామోదర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారస్థులతో మాట్లాడుతూ ఇటువంటి లోపాలున్న ఉత్పత్తులు విక్రయానికి ఉంచరాదని సూచించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

43 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-గజపతినగరం

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు గజపతినగరం మండలం పాత బగ్గాం గ్రామ పరిధిలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సంగంరెడ్డి సత్యంను అదుపు లోకి తీసుకొని 43 మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తలెఇపారు. దాడుల్లో ఎస్‌ఐ సి.హెచ్.రాజశ్రీ, హెచ్‌సి జి.సుదర్శన్ కుమార్, కానిస్టేబుళ్లు బి.రాము, ఎల్. జగన్నధరావు పాల్గొన్నారు.

లింగాలవసలో 11 బాటిళ్లు..

భోగాపురం : మండలంలోని లింగాలవలస పరిధిలో దాడులు నిర్వహించగా అనధికార ఇఎంఎల్. విక్రయం కేసును గుర్తించి బుగత రామసూరి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌పోలీసులు తెలిపారు. అతడి నుంచి 11నిప్స్ ఇఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.